క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రసాద్

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధారలో కళింగ వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, కళింగ వెల్ఫేర్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు ఎస్‌ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించి వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలుగుతూ కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని హితవు పలికారు. పోలీస్ నిఘా ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీ షీటర్లకు ఎస్‌ఐ సూచించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా వికాసంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న రమాప్రభ, విద్యార్థులు

కంచరపాలెం: వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ కమిటీ, బొట్చా నర్సింగరావు ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఊర్వశి జంక్షన్‌లోని బీఎస్‌ఆర్ భవనంలో విద్యా-వికాసంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి విద్యావేత్త కె.రమాప్రభ మాట్లాడుతూ విద్యార్థి దశలో అభివృద్ధి చెందితే వికాసానికి మార్గాలు దొరుకుతాయన్నారు. తద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. విద్యా వికాసంపై పలువురు అడిగిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, బీఎస్‌ఆర్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



విందులో పాల్గొన్న ముస్లింలు

మద్దిపాలెం: రంజాన్‌ను పురస్కరించుకుని 53వ వార్డు మద్దిపాలెం మస్జిద్-ఈ-అల్ ఫతాలో ఆదివారం రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలు, మహిళలకు ప్రత్యేకమైన హలీంను అందించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యాయామమే దివ్య ఔషధం



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ నారాయణ, వాకర్స్ క్లబ్ సభ్యులు

బీచ్ రోడ్డు: సీ షోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వీఎంఆర్‌డీఏ పార్క్ వద్ద పార్కిన్సన్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా న్యూరాలజిస్ట్ డాక్టర్ ఆర్.వి.నారాయణ మాట్లాడుతూ నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి భౌతిక, మానసిక వ్యాయామాలే దివ్య ఔషధాలన్నారు. 50 ఏళ్ల వయస్సు దాటిన వారిలో నాడీ కణాలు మెదడును దెబ్బ తీయడం మూలంగానే పార్కిన్సన్స్ వ్యాధి వస్తుందన్నారు. ఈ వ్యాధి వల్ల చేతులు, కాళ్లు, దవడల్లో వణుకు రావడం, కండరాల బిగదీయడం, పట్టేయడం, నిరాశ, భయం, చొంగకారడం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. డాక్టర్ ప్రదీప్, డాక్టర్ అచ్యుత్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె.ఎస్.సాయి ప్రసాద్, పోతన్న రెడ్డి పాల్గొన్నారు.

హరితం.. ఆకర్షణీయం

- హరిత పార్కులో అభివృద్ధి వెలుగులు
- అదనపు సౌకర్యాల కల్పనకు చర్యలు
- సందర్శకులను ఆహ్వానిస్తున్న పచ్చదనం



ఓపెన్ జిమ్ పరికరాలు



నూతనంగా నిర్మించిన ప్రహరీ



మురళీనగర్ సెక్టార్-8లోని హరిత పార్కులో పచ్చదనం

మురళీనగర్: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ సెక్టార్-8లోని హరిత పార్కు.. పేరుకు తగ్గట్టుగానే పచ్చదనంతో సందర్శకులను ఆకర్షిస్తోంది. గతంలో ఈ ఉద్యానవనం అభివృద్ధికి నోచుకోక సందర్శకులు తక్కువగా వచ్చేవారు. కనీస సౌకర్యాలు పార్కు నిర్వాహకులే కల్పించుకున్నారు. తుపాను సమయాల్లో కొండపై నుంచి వరద నీరు పార్కు మీదకు వచ్చి పడేది. దీంతో ఈ పార్కును పూర్వ స్థితికి తేవడం కష్టగా మారింది. స్థానిక కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ చొరవ తీసుకుని పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టారు.

స్థానికుల విరాళాలతో అభివృద్ధి

హరిత పార్కును ఇరవై ఏళ్ల కిందట ఎకరం స్థలంలో ఏర్పాటు చేశారు. స్థానికుల విరాళాలతో దీన్ని అభివృద్ధి చేశారు. పార్కులో పచ్చదనం పెంపుతోపాటు వాకింగ్ ట్రాక్ నిర్మించారు. పిల్లలను ఆకట్టుకునేందుకు బుద్ధుడు, జిరాఫీ బొమ్మలను సిమెంటుతో తయారు చేశారు. బ్యాడ్మింటన్ కోర్టు అందుబాటులోకి తెచ్చారు. కళాప్రాంగణాన్ని తిప్పారెడ్డి, ఇతర కమిటీ సభ్యులు సమకూర్చిన నిధులతో నిర్మించారు. వర్షాల్లో కొండవాలు నుంచి ఎగిసిపడే వరద నీటి తాకిడికి గతంలో జీవీఎంసీ నిర్మించిన ప్రహరీ గోడ కూలిపోయింది. దీంతో పార్కుకు రక్షణ కొరవడింది. మురళీనగర్ కొండ ప్రాంతంలో ఓ మూలన ఉండటంతో పార్కు అభివృద్ధిని పట్టించుకునే వారు కరవయ్యారు. పార్కు నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పార్కులో అదనపు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకున్నారు.

ఇవీ నూతన సౌకర్యాలు

ప్రస్తుతం జీవీఎంసీ సహకారంతో పార్కు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో హరిత పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పార్కు మొత్తం అందమైన మొక్కలతో కళకళలాడుతోంది. బ్యూటిఫికేషన్ విషయంతో తగు జాగ్రత్తలు తీసుకుని అందంగా తయారు చేశారు. ముఖ్యంగా పార్కు రక్షణకు అవసరమైన ప్రహరీ గోడను రూ.6 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించారు. దీనికి రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. రూ.1.50 లక్షల ఓపెన్ జిమ్‌ను జీవీఎంసీ ఏర్పాటు చేసింది. కమిటీ సభ్యులు సమకూర్చిన రూ.3 లక్షలతో షటిల్ కోర్టును నిర్మించి ఇటీవల ప్రారంభించారు. పిల్లల కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించి దీని అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. వాచ్‌మన్ గది నిర్మాణంలో ఉంది. పార్కులో అనేక సౌకర్యాలు కల్పిస్తుండటంతో సందర్శకుల సందడి పెరిగింది.

జీవీఎంసీ సహకారంతో మరింత అభివృద్ధి



జీవీఎంసీ సహకరిస్తే హరిత పార్కును మరింత అందంగా తీర్చిదిద్దుతాం. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, స్థానిక నాయకుల సహకారంతో పార్కును అభివృద్ధి చేస్తున్నాం. ప్రస్తుతం పార్కు చుట్టూ డ్రైనేజీ ఏర్పాటు చేయాల్సి ఉంది. వాకింగ్ ట్రాక్ ప్రవేశ ద్వారం గేటు, పిల్లలకు కేటాయించిన పార్కు స్థలంలో ఆట పరికరాలు, షటిల్ కోర్టు చుట్టూ ప్రహరీ గోడ పునర్నిర్మించాలి. ఈ పనులపై జీవీఎంసీ అధికారులు, కార్పొరేటర్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఇవి కార్యరూపం దాల్చుతాయి.
– పిల్లా కొండలరావు, అధ్యక్షుడు, హరిత పార్కు

హెల్మెట్ ధారణ తప్పనిసరి



కంచరపాలెం వద్ద ప్లకార్డు చూపిస్తూ అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు

మద్దిపాలెం: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం ట్రాఫిక్ పోలీసులు కంచరపాలెం మెట్టు, తాటిచెట్లపాలెం నుంచి ఎన్‌ఏడీ వరకు హెల్మెట్ ధారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధారణపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మళ్ల అప్పారావు మాట్లాడుతూ గతేడాది హెల్మెట్ ధరించక 147 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించినట్టు తెలిపారు. ప్రతి ఒక్క వాహనదారుడికి కౌన్సెలింగ్ నిర్వహించడమే కాకుండా వారి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా హెల్మెట్ ధారణ ఆవశ్యకతను వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపి ఇబ్బంది కలిగిస్తున్నవారు, మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి తగు కౌన్సెలింగ్ చేశారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఎయిర్‌పోర్టు ఎస్‌ఐ వాసుదేవరావు, ఎస్‌ఐ ఉల్‌హక్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలం

దాబాగార్డెన్స్: సేంద్రియ ఉత్పత్తుల వినియోగం ఉత్తమమని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పేర్కొన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ స్టోర్‌ను ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. విశాఖ ప్రజలకు ఆర్గానిక్ ఉత్పత్తులు అందుబాటులోకి తేవడం సంతోషకరమన్నారు. స్టోర్‌లో విక్రయించే ఉత్పత్తులను ప్లాస్టిక్ రహిత సామగ్రిలో ప్యాక్ చేయడంపై నిర్వాహకులను అభినందించారు. స్టోర్ నిర్వాహకురాలు ప్రమీల మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ఆర్గానిక్ స్టోర్ ఏర్పాటు చేశామన్నారు. సేంద్రియ ఉత్పత్తులు వినియోగిస్తే అనేక భయంకరమైన రోగాల బారిన పడకుండా ఉంటామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పల్లవి, గజేంద్ర అక్షయ్, సంతోష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ ఆరాధనలు



ఈస్టర్ సందేశమిస్తున్న సిస్టర్ షైలాపాల్

తాటిచెట్లపాలెం: ఏసుక్రీస్తు పునరుత్థాన దినం ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైఫ్ చేంజింగ్ రివైవల్ సెంటర్ పి.జె. స్టీఫెన్ పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. తెల్లవారుజామున 4 గంటల నుంచి ప్రారంభమైన సూర్యోదయ ఆరాధన, అనంతరం పలు ఆరాధనల్లో దైవజనుడు పి.జె.స్టీఫెన్ పాల్ వర్చువల్‌గా సందేశం అందించారు. సిస్టర్ షైలాపాల్ ప్రత్యక్షంగా ఈస్టర్ సందేశాన్ని తెలియజేశారు. ఈ పునరుత్థాన శక్తి వల్ల మానవులకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఈస్టర్ వేడుకల్లో నగరం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ఏసుక్రీస్తును ఆరాధించారు.

యువత భవిత కోసం ఆలోచన అవసరం

ఆరిలోవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిన అవసరం ఉందని ఏఐవైఎఫ్ నాయకుడు క్షేత్రపాల్ అన్నారు. ఆరిలోవ ప్రాంతం అల్లూరి సీతారామరాజు నగర్‌లో ఆదివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో యువతకు జరుగుతున్న అన్యాయం, సమస్యలను వివరించారు. యువత భవిష్యత్తు గురించి ఆలోచించగలిగినప్పుడే దేశం మంచి మార్గంలో ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, ఆరిలోవ శాఖ అధ్యక్షుడు అప్పలరాజు, చరణ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ సేవలు అమోఘం



మాట్లాడుతున్న మాజీ వీసీ సత్యనారాయణ

దాబాగార్డెన్స్: హక్కుల పరిరక్షణలో మానవ హక్కుల కౌన్సిల్ ప్రతినిధులు చేస్తున్న సేవలు అమోఘమని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వై.సత్యనారాయణ కొనియాడారు. మానవ హక్కుల కౌన్సిల్ 23వ సర్వసభ్య సమావేశం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ మానవ హక్కులకు భంగం కలిగే సమయంలో కౌన్సిల్ ప్రతినిధులు పౌర హక్కుల పరిరక్షణకు చేసే పోరాటం మరువలేమన్నారు. కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు పౌర హక్కులపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పౌరహక్కుల పరిరక్షణకు రాజీ లేకుండా కృషి చేస్తున్నామని అన్నారు. విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు న్యాయవాదులుగా తమ వంతు కృషి చేస్తున్నామని, కౌన్సిల్ చేస్తున్న కృషికి తమ సహకారం ఉంటుందన్నారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా మానవ హక్కులకు సంబంధించి బాధితులకు న్యాయం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ పోలీస్ అధికారి ఎస్వీ రమణ, బీఎస్ లత, మాధవి గణపతి, నిర్మల, డాక్టర్ వాసవి తదితరులు పాల్గొన్నారు.

సేవా సంఘం సర్వసభ్య సమావేశం

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలో గల సంఘ కార్యాలయంలో నిర్వహించారు. సంఘ భవిష్యత్ కార్యక్రమాలతో పాటు పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కొణతాల శ్రీనివాస్‌ను మరోసారి ఏకగ్రీవంగా నియమిస్తున్నట్టు తీర్మానం చేశారు. సంఘ అధ్యక్షుడు మాట్లాడుతూ ఈ నెల 14న నూతనంగా నియమితులైన సంఘ ప్రతినిధుల ప్రమాణ స్వీకారంతో పాటు జనరల్ బాడీ కమిటీ ఏర్పాటు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి, సంఘ సలహా కమిటీ చైర్మన్ బొడ్డేపల్లి రామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్, అధికార ప్రతినిధి బమ్మిడి గంగాధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్కే రామకృష్ణ నాయుడు, కోశాధికారి ఉమామహేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, కొణతాల రాధ, కె. కాత్యాయిని, పి. సత్యనారాయణాచారి, కె. నర్సింగరావు, పి. రామకృష్ణ, సన్యాసినాయుడు, వీఎస్‌టీ నాయుడు, చల్లారావు, రాందేవ్, కె. రాము, బి. లక్ష్మి, రవణమ్మ, త్రినాథ్, గోవింద్, ప్రసాద్ పాల్గొన్నారు.

సమాజ సేవలో న్యూ హోప్ ఫౌండేషన్



మిస్ అండ్ మిసెస్ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

దాబాగార్డెన్స్: న్యూ హోప్ ఫౌండేషన్ స్థాపించిన నాటి నుంచి ఎంతో మందికి వివిధ రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఆదివారం మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఆడిషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగేళ్లుగా చేనేత కార్మికులు, రైతుల చేయూతకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విశాఖకు చెందిన మహిళలకు ఆడిషన్స్ నిర్వహించామన్నారు. సుమారు వంద మంది ఔత్సాహికులు పాల్గొన్నారని, వీరిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసినట్టు తెలిపారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వారికి త్వరలో ఆడిషన్స్ ఉంటాయని చెప్పారు. ఫైనల్ పోటీలు విశాఖలో నిర్వహిస్తామన్నారు. యువ సినీ నటుడు నేత సురేష్‌నాయుడు మాట్లాడుతూ చేనేత కార్మికులు, రైతులకు అండగా నిలుస్తున్న నాగమల్లేశ్వరిని అభినందించారు. అనంతరం మిసెస్ ఉత్తరాంధ్ర విభాగానికి ఎంపికైన విజేత భాగ్యకు అతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

చురుగ్గా 'జగనన్నే మా భవిష్యత్తు'



49వ వార్డులో ప్రజాభిప్రాయాలు సేకరిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు



శ్రీనివాసనగర్‌లో ఒక మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ



సోనియాగాంధీ నగర్‌లో కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు, పైడి రమణ

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో ఆదివారం వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. 282 సచివాలయం పరిధిలోని నివాసులను కార్పొరేటరు శంకరరావు స్వయంగా కలిసి ప్రభుత్వ పాలనను వివరించారు. ప్రజలు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ప్రభుత్వ పరిపాలన మెరుగుపరుకునేందుకు పలువురు తమ అభిప్రాయాలను, సూచనలను చేశారు. వీటిని కార్పొరేటర్ నమోదు చేశారు. కార్యక్రమంలో వలంటీర్ దుర్గాభవాని, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొట్ట శంకర్, మున్నా, శివారం, ప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.

43వ వార్డులో జోరుగా..

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జోరుగా సాగుతోంది. స్థానిక శ్రీనివాసనగర్‌లో ఆదివారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. నాలుగేళ్లుగా ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం వారి అనుమతితో ఇంటికి, మొబైల్ ఫోన్‌కు స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

45వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు 255 సచివాలయం పరిధిలోని పలు కాలనీల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చురుగ్గా నిర్వహించారు. సోనియాగాంధీ నగర్‌లో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు, సచివాలయ కన్వీనర్ పైడి రమణ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరుపై సర్వే నిర్వహించారు. గృహసారథులు వెంకటలక్ష్మి, తులసీరావు, వలంటీర్ సురేష్, కామేశ్వరి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ జగన్‌నే గెలిపించుకుందాం

మద్దిపాలెం: నాలుగేళ్లుగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. 51వ వార్డు 289 సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కోసం వివరించి, స్టిక్కర్లు అతికించారు.

50వ వార్డులో..

జీవీఎంసీ 50వ వార్డు 292 సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను, అభివృద్ధిని వివరించారు. వారి ఇంటికి స్టిక్కర్ అతికించి పథకాల కరపత్రాలను అందజేశారు. సచివాలయ కన్వీనర్ సనపల నారాయణస్వామి, వలంటీర్లు అంజలి, ప్రశాంతి, గృహసారథులు కంచరాన జగదీష్, సుమతి, సత్యనారాయణ, మెట్ట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినంగా మే డే



ధర్నా చేస్తున్న వామనమూర్తి, ఆటో డ్రైవర్లు

సీతంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మే డేను సెలవు దినంగా ప్రకటించాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి కోరారు. అక్కయ్యపాలెం హైవే కూడలిలో ఆదివారం జరిగిన ఆటో డ్రైవర్ల ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కాపాడాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను ఆపాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి వేళ మహిళా కార్మికులతో పనిచేయించే విధానం రద్దు చేయాలని కోరారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను నేటి ప్రభుత్వాలు హరిస్తున్నాయని మండిపడ్డారు. కార్మిక వర్గ హక్కుల సాధనకు మే 1 జరుగు 137వ మే డేను పోరాట దినంగా పాటించి, వాడవాడలా ఎర్రజెండా ఎగురేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేలం శివ, కె.సత్తిబాబు, సిహెచ్.శంకరరావు, రావికృష్ణ, పి.బాలు, జి.నందీశ్వరరావు, కె.సుందరరావు పాల్గొన్నారు.

సమాచారమ్

అందుబాటులో జోన్-5 అధికారులు



జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అధికారులు ప్రజలకు అందుబాటులో ఉన్నారు. జోన్ పరిధిలో 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. జోన్ పరిధి ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం వీరంతా పౌర సమాచార అధికారులుగా సేవలందిస్తున్నారు. జోన్ పరిధిలో ఏదైనా సమాచారం తెలుసుకోడానికి, సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి కింద పేర్కొన్న అధికారుల ఫోన్ నంబర్లకు కాల్ చేయవచ్చు. జ్ఞానాపురంలో జీవీఎంసీ జోన్-5 కార్యాలయం ఉంది. అక్కడ ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో నేరుగా ప్రజలు అర్జీలు సమర్పించవచ్చు.

జీవీఎంసీ జోన్-5 అధికారుల సమాచారం

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్ ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్-1 (రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్-2 (టౌన్‌ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	9989784585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్	99480 78507
డాక్టర్ ఎ.రాజేష్	అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (పబ్లిక్ హెల్త్)	99480 95520
ఐ.వి.రమణమూర్తి	అసిస్టెంట్ సిటీ ప్లానర్	81878 99199
కె.పద్మావతి	సీడీవో, ఏపీడీ ఇన్‌చార్జి(యూసీడీ)	89190 80201
ఆర్. బాబూరావు	రెవెన్యూ కమిషనర్	88972 10764

కుటుంబ సభ్యుల చెంతకు ఉమేష్



ఉమేష్‌ను అప్పగిస్తున్న మురళి, పోలీసులు

ఎంవీపీ కాలనీ: మానసిక సమస్యల కారణంగా కుటుంబానికి దూరమైన కబ్బే ఉమేష్(20) అనే యువకుడిని రెడ్‌క్రాస్ ప్రతినిధి మురళి త్రీటౌన్ పోలీసుల సమక్షంలో అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మానసిక స్థితి బాగోకపోవడంతో బళ్లారి ప్రాంతానికి చెందిన ఉమేష్ ఇంట్లో నుంచి పారిపోయి కొన్ని రోజుల క్రితం విశాఖ చేరుకున్నాడు. ఆర్కే బీచ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అక్కడి టూరిజం పోలీసు స్టేషన్ సిబ్బంది త్రీటౌన్‌కు సమాచారం అందించారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకున్న త్రీటౌన్ పోలీసులు సీఐ రామారావు సూచన మేరకు పెదవాల్తేర్‌లోని రెడ్ క్రాస్ సొసైటీకి తరలించారు. కొద్ది రోజులుగా ఉమేష్ అక్కడే ఆశ్రయం పొందుతున్నాడు. అయితే రెడ్ క్రాస్ ప్రతినిధులు అతని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. త్రీటౌన్ పోలీసుల సమక్షంలో ఉమేష్‌ను కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ ప్రతినిధులు అప్పగించారు.